క్లుప్తంగా

విద్యార్థిని చికిత్సకు ఎల్‌ఓసీ



ఎల్‌ఓసీ అందిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్: ఖమ్మం శ్రీనగర్ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని పి.శ్లోక వైద్య చికిత్స కోసం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం అందించారు. ఆమె ఐదేళ్లుగా ఎముకల్లో ట్యూమర్‌తో బాధపడుతుండగా, చికిత్సలో భాగంగా ఎడమ చేయి తొలగించారు. అనంతరం వెన్నెముకకు సైతం శస్త్రచికిత్స జరగగా, ప్రస్తుతం ఊపిరితిత్తుల్లో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. తండ్రి లేని కుటుంబంలో చికిత్స కోసం మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ప్రభుత్వం ద్వారా సీఎంఆర్ఎఫ్ కింద రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని అందించడమే కాక కృత్రిమ చేయి ఏర్పాటు, ఉన్నత విద్యకు సహకరిస్తానని హామీ ఇచ్చారు.

సీపీఆర్‌పై అవగాహన

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికిపై సీపీఆర్‌పై అవగాహన అవసరమని ఖమ్మం ప్రభుత్వాస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్, డీపీవో డి.రామారావు అన్నారు. శుక్రవారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం న్యూరో ఫిజియాట్రిస్ట్ సోహెల్, మంచుకొండ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బాలకృష్ణ, వైస్‌ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

ఖమ్మంఅర్బన్: మమత మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అనురాధ, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామస్వామి, విభాగాధిపతి డా. మహేంద్రకుమార్, ప్రొఫెసర్ డా. హనుమంతరావు, నర్సింగ్ ప్రిన్సిపాల్ కృష్ణ వైష్ణవి విద్యార్థులు పాల్గొన్నారు.

యుద్ధ వీరుడికి సన్మానం



తిరుమలాయపాలెం: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఖమ్మం రూరల్ మండలం గొల్లగూడెంకు చెందిన మిడికంటి కిషోర్‌రెడ్డిని శుక్రవారం సన్మానించారు. ఇటీవల స్వస్థలానికి వచ్చిన ఆయన్ని తిరుమలాయపాలెం మండలం ఎదుళ్లచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో సన్మానించి పలువురు మాట్లాడారు. పాకిస్తాన్‌పై యుద్ధంలో పాల్గొని భారత విశిష్ట సేవా పురస్కారానికి ఎంపికైన కిషోర్‌రెడ్డిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం రవి, రిటైర్డ్ ఏఎంఓ పోట్ల వెంకటప్పయ్య, వల్లభనేని వినోద్, కమతం బాబు, కమతం రాము పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీ



ఖమ్మంగాంధీచౌక్: గో సేవా విభాగం తెలంగాణ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని త్రీటౌన్, గుట్టలబజార్ శ్రీరామకృష్ణ విద్యాలయంలో 'గోవు పర్యావరణ పరిరక్షణ అంశంపై' పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులతో పాటు ఎకో క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ డాక్టర్ కడవెండి వుణుగోపాల్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. గో సేవకులు చైతన్య కిశోర్, మధు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని దానవాయిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో రైల్వే లైన్ క్రాసింగ్ తొలగింపు పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు సారథినగర్, రామాలయం వీధి, సాయిబాబా టెంపుల్ ప్రాంతం, పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీపుర, రెయిన్బో కాలనీ, దన్వాయిగూడెం, రామన్నపేట, సబ్‌జైల్ ప్రాంతం, కామంచికల్, జాన్‌బాద్ తండా, దారేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ నాగార్జున శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా నగరంలోని రామాలయం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేఈ చర్చి కాంపౌండ్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారపు పేట, చర్చికాంపౌండ్, రిక్కాబజార్, రామకృష్ణనగర్, మేదరబజార్, అమ్మాభవాని టెంపుల్ ఏరియా, రంగవారివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారుల సహకరించాలని ఏడీఈ కోరారు.

మద్దులపల్లి మార్గంలో కష్టాలు

గుంతలమయంగా మారిన రహదారి

- దశాబ్దకాలంగా ప్రతిపాదనలతోనే సరిపెడుతున్న అధికారులు
- మూడేళ్ల క్రితం నిర్మాణం మొదలుపెట్టినా పూర్తికాని వైనం



అధ్వానంగా ఉన్న మార్కెట్ యార్డుకు వెళ్లే రహదారి

ఖమ్మంరూరల్: ఆటోనగర్ నుండి మద్దులపల్లి మార్కెట్ యార్డు వరకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. దశాబ్దకాలంగా ప్రతిపాదనలతోనే అధికారులు సరిపెట్టడం తప్ప రోడ్డు నిర్మాణానికి మాత్రం మోక్షం లభించడంలేదు. దీంతో ఈ రోడ్డులో వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తోంది. మూడేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఆటోనగర్ నుండి పాన్నేకల్ వరకు రోడ్డు నిర్మాణానికి మెటల్ వేశారు. మద్దులపల్లి రెవెన్యూ పరిధిలోని ఎన్ఎస్పీ కాల్వ పక్కన మార్కెట్ యార్డు ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. ఆటోనగర్ నుంచి మార్కెట్ వరకు డబుల్‌రోడ్డు వేసేందుకు ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ వెంటనే అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే రోడ్డు నిర్మాణం మాత్రం ముందుకు సాగడంలేదు. వ్యవసాయ మార్కెట్ ప్రారంభం కాకమునుపే మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయకపోవడం విశేషం.

అడుగడుగునా బురదే..

మార్కెట్ యార్డుకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో రోజు పలు రకాల వాహనాలు వెళ్తుంటాయి. అయితే ఐదేళ్ల క్రితం కంకర వేసి వదిలేయడంతో ఇప్పుడు రోడ్డుపై కంకర తేలి దారుణంగా తయారైంది. కంకర తేలి అడుగు ముందుకేయలేని పరిస్థితి నెలకొంది. అయితే ఇటీవల కాలంలో రోడ్డు వెంట పలు కాలనీలు వెలిశాయి. యార్డుకు వెళ్లే రోడ్డు కావడంతో మున్ముందు అభివృద్ధి చెందుతుందని చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు.

అక్రమ రవాణాకు సులువైన మార్గం..

వెంచర్ల కారణంగా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. సమీప గుట్టల నుంచి రేయింబవళ్లు మట్టి తవ్వకాలు జరిగాయి. అక్రమ రవాణాకు ఇదే మార్గమైంది. రేషన్‌బియ్యం, ఇసుక దందాకు కూడా ఇదే సులువైన మార్గంగా ఉంది. ఇంకా ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకూ అడ్డాగానే ఉంది. పోలీసుల కంటపడకుండా డొంక మార్గాన్ని అక్రమార్కులు ఎంచుకుంటారు. ముదిగొండ మండలం గంధసిరి నుండి ఇసుక క్వారీ నుంచి అర్ధరాత్రి కోదాడ క్రాస్‌రోడ్, అక్కడి నుండి తెల్దారుపల్లి వద్ద ఉన్న ఎన్ఎస్పీ కాల్వ కట్ట మీదుగా ఈ దారిని చేరుకుంటారు. రాత్రి పూట నిఘా తక్కువగా ఉండటంతో అక్రమార్కులు ఈ రోడ్డును ఎంచుకుని తమ పని సాఫీగా కానిచ్చేస్తున్నారు. ఇలా అన్ని వాహనాలు ఈ రోడ్డు గుండానే వెళ్లడంతో రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి కనీసం ద్విచక్రవాహనాలు వెళ్లలేని దుర్భర పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానికులు మంత్రి పొంగులేటి. శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకురాగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరగా రోడ్డు పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

త్వరగా రోడ్డు నిర్మించాలి



మార్కెట్‌కు వెళ్లే రోడ్డును త్వరగా నిర్మించాలి. ఈ రోడ్డుపై వెళ్లాలంటే అన్నీ గుంతలే ఉండి వెళ్లలేని పరిస్థితి ఉంది. భవిష్యత్‌లో ఇక్కడి మార్కెట్‌లో అన్ని రకాల వ్యాపార లావాదేవీలు ఉండనున్నందున రోడ్డు నిర్మించాలి. రైతులు కూడా పడిన పంటను మార్కెట్‌కు తరలించాలంటే బ్బందిగా ఉంటుంది.

– పి.రమేష్, పోచారం

బీసీ రిజర్వేషన్‌ను అడ్డుకుంటున్న బీజేపీ



కామేపల్లి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



కూసుమంచిలో..



నేలకొండపల్లిలో..

కూసుమంచి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ అడ్డుకుంటుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మంతరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. శనివారం నిర్వహించే రాష్ట్రబంద్‌కు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, ఈ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, గురుమూర్తి, రమణారెడ్డి, గంగాధర్, గన్యానాయక్, రాధాకృష్ణ, వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, ఎడ్ల తిరపతిరావు, మార్తి కొండలరావు, ఏటుకూరి రామారావు, పెద్దిరాజు నర్సయ్య, మందడపు మురళీకృష్ణ, సామాల మల్లిఖార్జున్‌రావు, భూక్యా కృష్ణ, బలుసు ప్రమీల పాల్గొన్నారు.

కామేపల్లి: రిజర్వేషన్ కల్పించకుండా అడ్డుకుంటున్న కేంద్ర ప్రభుత్వం విధానాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. నాయకులు బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, ఆమంచి అంజయ్య, రామకృష్ణ, బాగం రామారావు, లింగస్వామి, షేక్ ఖాసీం, అద్దంకి వెంకటేశ్వర్లు ఉన్నారు.

యాంత్రీకరణకు దరఖాస్తు చేసుకోండి

నేలకొండపల్లి: వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని నేలకొండపల్లి ఏఓ యం.రాధ సూచించారు. మండలకేంద్రంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతులకు సబ్సిడీపై యాంత్రీకరణ పనిముట్లను అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ నెల 21 నుంచి 24 వరకు దరఖాస్తులు అందించాలని కోరారు. ఆసక్తి ఉన్న రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, రైతు పాస్‌పోర్టు ఫొటోలు-2 లతో దరఖాస్తులను స్థానిక ఏఈవోలకు అందించాలని కోరారు.

సర్వేయర్లకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: లైసెన్స్‌డ్ సర్వేయర్ ఫలితాలు విడుదలైన సందర్భంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులును అభ్యర్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. సర్వే రంగంలో సాంకేతిక పరిజ్ఞానం, క్రమశిక్షణ, మరియు ప్రామాణికతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వీరబాబు, నాగరాజు, ఆడెపు కృష్ణమోహన్, రమేష్, లావణ్య, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

కార్యదర్శులపై తప్పుడు ప్రచారం సరికాదు

నేలకొండపల్లి: పంచాయతీ కార్యదర్శులను బ్లాక్ మెయిల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చెన్నారం పంచాయతీ కార్యదర్శిని డబ్బు కోసం వేధించడమే కాకుండా అందుకు నిరాకరించడంతో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేశాడని ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద తెలిపి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

సాయం కోసం సంప్రదించండి



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రావు

ఖమ్మంలీగల్: ప్రజా సమస్యలపై ఎలాంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ.చంద్రశేఖర్‌రావు అన్నారు. శుక్రవారం నగరంలోని యూపీహెచ్ కాలనీ బాలాజీనగర్‌లో దారిద్ర్య నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల చట్టాలు, మోటారు వెహికిల్ చట్టాలపై అవగాహన కల్పించారు. పీఎల్‌వీలు కోమలత, జ్యోతిరెడ్డి, విజయ, గురునాగలక్ష్మి పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు, అన్నప్రాసన

ఖమ్మం మామిళ్లగూడెం: పోషణమాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బురహాన్‌పురం సెక్టార్ పరిధిలో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులతో పాటు బాలింతలు తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంగోపాల్ రెడ్డి, సీడీపీఓ వీరభద్రమ్మ, పీఆర్టీయూ నాయకులు శేఖర్, కార్పొరేటర్ పాలెపు విజయ, డాక్టర్ గీతా, డిస్టిక్ పోషణ్ అభియాన్ డీసీ బాబు, పోషణ అభియాన్ బీసీ లలిత, సెక్టార్ సూపర్‌వైజర్ బి.సుధా భవాని, ఏఎన్ఎం భవాని, రాజేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

క్రీడాకారులకు సన్మానం

ఖమ్మం సహకారనగర్: ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు ప్రతిభ కనబర్చిన మణికంఠ, సిద్ధార్థ, గణేష్ లను శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినంది సన్మానించారు. అనంతరం కళాశాలలో సీపీఆర్‌పై ముస్తాఫానగర్ పీహెచ్‌సీ వైద్యులు రమేష్ అవగాహన కల్పించారు.

దాడిచేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం గుట్టలబజారుకు చెందిన కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుడు తోళ్ల రాకేష్‌పై మూకుమ్మడిగా దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి కందికట్ల విజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఖమ్మం ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అక్టోబర్ 12న కాంగ్రెస్ ఏర్పాటుచేసిన ఓటు చోరీ కార్యక్రమంలో భాగంగా వీడియోస్ కాలనీలో ర్యాలీలో ఉన్న రాకేష్‌పై డోర్నకల్‌కు చెందిన కొంతమంది కారులో వచ్చి ఒకేసారి దాడి చేశారని ఆరోపించారు. దాడి చేసినవారిని, రాకేష్‌ను స్టేషన్‌లో ఒకే సెల్‌లో వేయడం అనుమానాలకు తావిస్తోందని, స్టేషన్‌లో ఉన్నప్పుడూ చంపుతామని బెదిరించారని రాకేష్ ఫిర్యాదు చేసిన మంత్రులు పట్టించుకోలేదని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్, తూరిగంటి అంజయ్య, నాయకులు నరసింహారావు, రాము, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'బీసీలను మరో మారు మోసం చేసే కుట్ర'

నేలకొండపల్లి: బీసీలను రిజర్వేషన్ పేరుతో ప్రభుత్వం మరోమారు కుట్ర చేస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. శనివారం బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ బంద్‌కు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. సొసైటీ చైర్మన్లు నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, షేక్ హుస్సేన్, మరికంటి రేణుబాబు, ఆదాం, కమదన ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఎకో బజార్'

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఎకో బజార్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా బాణోతు రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులంతా తమ నైపుణ్యాలతో వివిధ రకాల వస్తువులను, ఆహార పదార్థాలను, ఆర్గానిక్ ఫ్రూట్స్, చిరుధాన్యాలను, పర్యావరణ సహిత పదార్థాలతో వస్తువులను తయారు చేయటం అభినందనీయమన్నారు. లయన్స్ సభ్యులు డీపీసీ రావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ ఏజే రామారావు, కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్ ఉన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు

ఖమ్మంఅర్బన్: మూడురోజుల పాటు నగరంలోని బ్లూమింగ్ మైండ్ స్కూల్‌లో ఉత్సాహభరితంగా సాగిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఎంఈఓ శైలజాలక్ష్మి, కన్వీనర్ బ్లూమింగ్ మైండ్స్ కరస్పాండెంట్ అశోక్ రెడ్డి, వివిధ హెచ్ఎంలు, పీఈటీలు సాంబమూర్తి, దుర్గాభవాని, కె.ఆదర్శకుమార్, రాజన్ విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని 22 పాఠశాలల నుంచి 1,340 మంది క్రీడాకారులు ఈ క్రీడల్లో పాల్గొని ప్రతిభని చాటారని మండల క్రీడల కార్యదర్శి బియ్యని కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు నాగప్రసాద్, నాగుల్ మీరా, రోజా, రాము, షేక్ బిక్కన్, సంపత్, విజయ కుమారి, ఆర్గనైజర్లు వెంకట్, మహేష్, సరిత, నందిని, రిఫరీలు రాకేష్, వెంకట్, కృష్ణ, సాలార్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలో ఖాళీలు భర్తీ చేయాలి



సమస్యలు తెలుపుతున్న ప్రసాద్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సంస్థలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి టీజీయూఈఈయూ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వచ్చిన సీఎండీని కార్మిక సంఘ ప్రతినిధి ప్రసాద్ కలిసి సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి ఉంటుందని సీఎండీ హామీ ఇచ్చారు.

పత్తి అమ్మే ముందు స్లాట్ బుక్ చేయాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

రఘునాథపాలెం: మండలంలోని రాంక్యాతండాలో శుక్రవారం రైతులకు పత్తి పంట కొనుగోలు, యాసంగి విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ ఏడీఏ కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... రైతులు తమ పత్తి పంటను సీసీఐకు విక్రయించేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేయాలని సూచించారు. యాప్ వినియోగ, బుకింగ్ విధానాలపై సమగ్రంగా వివరించారు. మొక్కజొన్న పండించే రైతులు తప్పనిసరిగా రిజిస్టర్డ్ కంపెనీల నుంచే విత్తనం కొనుగోలు చేయాలని, విత్తనం తీసుకునే ముందు ఆ కంపెనీలతో బాండ్ పత్రం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వి.సాయి వేదవ్యాస్, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులపై ఓపెన్ ఫోరం



ఓపెన్‌ఫోరంలో పాల్గొన్న అధికారులు

కూసుమంచి: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం (సోషల్ ఆడిట్)ను నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీఓ శిరీష ఈ కార్యక్రమంలో పాల్గొనగా గ్రామాల వారీగా జరిగిన పనులపై ఆడిట్ సిబ్బంది నివేదికలను చదివి వినిపించారు. పనుల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది మస్టర్‌లు సక్రమంగా వేయకపోవటం, పనుల నమోదు సరిగా లేకపోవటం తదితర తప్పులపై అడిషనల్ డీఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది పనిలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలో మొత్తం 41 గ్రామ పంచాయతీలు ఉండగా రాత్రి వరకు కార్యక్రమం కొనసాగగా శనివారం మరికొన్ని గ్రామాల నివేదికలను ఫోరం ముందుంచనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాంచందర్‌రావు, జిల్లా విజిలెన్స్ అధికారి సక్రియ, అంబుడ్స్‌మెన్ రమేష్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ వీరయ్య, సోషల్ ఆడిట్ మేనేజర్ పవన్‌కుమార్, డీజీఎస్ ఏపీడీ శ్రీదేవి, ఎస్సార్పీ సురేందర్, ఈజీఎస్ ఏపీఓ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షపాతి కర్నాటి కృష్ణయ్య



మాట్లాడుతున్న కూనంనేని

నేలకొండపల్లి: నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రమించిన ప్రజల పక్షపాతి కర్నాటి కృష్ణయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం దివంగత మాజీ ఎమ్మెల్యే కర్నాటి కృష్ణయ్య వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ... మహోన్నీయుల ఆశయ సాధన కోసం క్షేత్ర స్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, జాతీయ నాయకులు భాగం హేమంతరావు, కనకబండి సీతారాములు, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు వున్నం బ్రహ్మయ్య, నాగుబండి శ్రీనివాసరావు, కోటి సైదారెడ్డి, హుస్సేన్, మరికంటి రేణుబాబు, కడియాల నరేష్, కేవీ.రెడ్డి, నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, యడ్ల తిరపతిరావు పాల్గొన్నారు.

ఎన్సీడీ రద్దు చేసి ఒత్తిడి తగ్గించాలి



ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

ఖమ్మం మామిళ్లగూడెం: వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు మొబైల్ అప్లికేషన్లు, ఎన్సీడీ రద్దుచేసి పనిఒత్తిడిని తగ్గించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి, టీకాలు మాత్రమే ఏఎన్ఎంలను ఉద్యోగంలోకి తీసుకున్నారన్నారు. కానీ కొంతకాలంగా వారు చేసిన పనులకు సంబంధించిన కొన్ని రిపోర్టులను ఆన్‌లైన్‌లో పంపించాలని ఒకటి రెండు యాపులతో ప్రారంభమై నేడు 14 యాపుల్లో పూర్తి చేయాల్సి వస్తుందని, రాత్రి 11 నుంచి ఒంటిగంట మధ్యలోనే యాపులు ఓపెన్ అవుతుంటే ఎలా పని చేయాలన్నారు. ఈ ధర్నాలో ఫస్ట్ ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, నాగమణి, సరస్వతి, రచ్చా సీత, విజయశ్రీ, దివ్య, ఫాతిమా, సంధ్య, రత్నమాల, మమత, లక్ష్మీ, సెకండ్ ఏఎన్ఎంలు జయమ్మ, రాజ్యలక్ష్మి, రాజేశ్వరి, శోభా, సుగుణ, మంగమ్మ, మరియమ్మ, అరుణ, భవాని, మాణిక్యమ్మ, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, స్నేహ, మేరీ, గీత, వసంత పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు 'దీపావళి'



రెజొనెన్స్ ఇన్ఫోలో..



స్మార్ట్ కిడ్జ్‌లో..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తుగా దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యజమాన్యాలు దీపావళి ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి టపాసులు కాల్చాయి.

ప్రశ్నిస్తే వేధించడం అప్రజాస్వామ్యకం



నేలకొండపల్లి: ఏపీలో ప్రజాకంఠ పాలనను నిగ్గదీస్తూ మోసాలను ఎండగడుతున్న 'సాక్షి' పత్రికపై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని జర్నలిస్టు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. నకిలీ మద్యం వ్యవహారంలో నిజాలు నిగ్గుతేల్చేలా 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై అక్కసుతో ప్రభుత్వ పెద్దలు కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.

వాస్తవాలు తెలియజేయటం నేరమా..?



ప్రజలకు నిజాలు చెప్పటం మీడియా కర్తవ్యం. అలా చేయటమే నేరమని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. పత్రికా స్వేచ్ఛను హరించిన ఏ ప్రభుత్వం మనగడ సాధించలేదని చరిత్ర చెబుతోంది. ప్రభుత్వం తీరు ఇప్పటికైనా మారాలి. వేధింపులకు ఏపీ ప్రభుత్వం స్వస్తి పలకాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గిరిజన సంఘం నాయకులు

రాజ్యాంగ విరుద్ధం..



సమాజంలో పత్రికలు నాలుగో స్తంభంలాంటివి. అలాంటి పత్రికల గొంతు నొక్కటం సమంజం కాదు.. జర్నలిస్టుల మీద కేసులు పెట్టటం, వేధించటం ఎంత మాత్రం సమర్థనీయం కాదు.

– బచ్చలకూరి నాగరాజు, సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్

అక్రమ కేసులు సిగ్గుచేటు..



ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజల కోసం పోరాటం చేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం వేధించటం సిగ్గుచేటు. సాక్షి ఎడిటర్ పై ఇతర జర్నలిస్టులపై పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు దారుణంగా ఉంది. ప్రతికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– తోళ్ల సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు

అంతా ఖండించాలి..



సాక్షి గొంతునొక్కే చర్యను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. పత్రికా స్వేచ్ఛను ఖూనీ చేయాలని చూస్తే సహించబోం. మీడియాపై దాడులు పిరికిపంద చర్య. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా పత్రికా విలువలు, ప్రజాస్వామ్యంను కాపాడాల్సిన అవసరం ఉంది.

– పీవీ.చలమయ్య, టీడీజేపీసీ చైర్మన్, నేలకొండపల్లి